మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట

# మున్సిపల్ సర్వసభ్య సమావేశం రసాభసా..

## అధికార-ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 3 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో సర్వసభ్య సమావేశం రసాభసాగా మారింది. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ కల్పన అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ సమావేశం వాడి వేడిగా సాగింది. ప్రజా సమస్యలను పక్కన పెట్టి ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ అధికార, ప్రతిపక్ష పార్టీ నేతలు గొడవ పడ్డారు. తాగునీరు, చెత్త సేకరణ, రోడ్లు, వీధిలైట్లు తదితర అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలను ఎజెండా అంశాల్లో చేర్చి చర్చించాల్సింది పోయి కేవలం ఆయా వార్డుల్లో పార్టీల వారీగా కౌన్సిలర్ల వారీగా ఖర్చు చేసుకున్న నిధుల అంశాలపై ఒకరికొకరు నిందలు వేసుకుంటూ తిట్ల పురాణం అందుకున్నారు. దీంతో సర్వసభ్య సమావేశంలో గందరగోళం వాతావరణం నెలకొంది. సుమారు 2.70 కోట్ల మిగులు నిధుల్లో వైకుంఠ రథం, రెండు ట్రాక్టర్లు, పది ఆటోల కొనుగోలు, నిధుల వాటాలు పంపకాల కొరకు కూడా టేబుల్ ఎజెండా కింద ప్రతిపాదన పెట్టి వాటాలు పంచుకోవాలని సభ్యులు పట్టు పడినట్లు తెలుస్తోంది. ప్రజాధనాన్ని లూటీ చేస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు తరచు ఆరోపణలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో సర్వసభ్య సమావేశంలోనూ అధికార విపక్ష పార్టీలు ఒకరినొకరు ఇదే అంశాలపై దూషించుకోవడం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. గత రెండు నెలల క్రితం సుమారు కోటి రూపాయలకు పైగా కార్మికుల వేతనాలను మెక్కేసిన సిబ్బందిపై ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోగా వాటిపై ఎలాంటి విచారణ కూడా చేపట్టకపోవడం పలు విమర్శలకు తావునిస్తోంది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాబురావు, మున్సిపల్ కమిషనర్, సురేష్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



రసభాస కొనసాగుతున్న సర్వసభ్య సమావేశం

## విప్లవాత్మక మార్పుకు నాంది

# సావిత్రి బాయిపూలే : జిల్లా కలెక్టర్

**గద్వాల,జనవరి 3 ప్రభాతవార్త :** భవిష్యత్తు తరాల కోసం తమ జీవితాలను త్యాగం చేసి మహిళల విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చిన మహానీయురాలు సావిత్రిబాయి పూలే అని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమంలో గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొని, సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా విద్యా వ్యాప్తికి అపార కృషి చేసిన సావిత్రిబాయి ఫూలే సేవలను గౌరవిస్తూ, తెలంగాణ ప్రభుత్వం ఆమె జయంతిని జనవరి 3న మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గద్వాల్ జిల్లాను విద్యా, అక్షరాస్యతలో ముందంజలో నిలపడం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. చిన్నప్పటి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థుల జీవితంలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని అన్నారు. ఉపాధ్యాయులు చెప్పే మార్గదర్శకత్వమే గుణం, స్వభావం, లక్ష్యసాధనకు బాటలు వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగా రావు, గద్వాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల హనుమంతు, అలంపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడప్ప, జిల్లా విద్యా శాఖ అధికారి అబ్దుల్ గని, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ బాబు, అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి, కలెక్టర్

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

## రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**దేవరకద్ర, జనవరి 3 ప్రభాతవార్త :** రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. దేవరకద్రలో శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్, స్థానిక శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుతోపాటు దేవరకద్ర, మక్తల్ ఎమ్మెల్యేలు జి. మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రసంగిస్తూ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వ అహర్నిశలు పాటు పడుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తుం దన్నారు. అభివృద్ధి ప్రభుత్వం ప్రధాన లక్ష్యం అన్నారు.అలాగే దేవరకద్ర, మక్తల్ ఎమ్మెల్యే లు ప్రసంగిస్తూ అభివృద్ధికి ప్రభుత్వం అహర్నిశలు పాటుపడుతుందన్నారు. త్వరలో ఇంకా గణనీయ అభివృద్ధి జరగనుంది. ఈ సందర్భంగా దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా కథలప్ప ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే మార్కెట్ యార్డ్ పాలకమండలి సభ్యులు కూడా ప్రమాణ చేశారు. స్థానిక శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానం చైర్మన్‌గా బీసు నర్సింహారెడ్డితో పాటు పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ శాఖ, దేవాదాయ శాఖ అధికారులతో పాటు టిపిసిసి ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్ కుమార్‌రెడ్డి, దేవరకద్ర, కౌకుంట్ల మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజిల్ రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, జవహర్, రాంపండు, కొండ గోవర్ధన్ రెడ్డి, ఆది హనుమంత్ రెడ్డి, అంజన్‌కుమార్‌లతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## తొలితరం మహిళా ఉద్యమకారిణి

# సావిత్రీబాయి పూలే : కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌గర్ బ్యూరో, జనవరి 3 ప్రభాతవార్త:** ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు,పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ హాల్‌లో సావిత్రీ బాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సావిత్రీ బాయి పూలే సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి. ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించి న ప్రేమస్వరూపిణి అన్నారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడు తుందని నమ్మిన ఆమె, తన భర్తతో కలసి 1848 జనవరి 1 నపూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించిందని అన్నారు సావిత్రీ బాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు, మహిళలకు,మహిళా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబంను,పిల్లలను తీర్చిదిద్దే ప్రతి మహిళా కూడా ఉపాధ్యాయురాలేనని అన్నారు. ఈ సందర్భంగా విద్యా రంగంలో సేవలు అందించిన నలుగురు మహిళా ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,జిల్లా విద్యా శాఖ అధికారి ప్రవీణ్ కుమార్, సియంవో బాలు యాదవ్ బైకాని, ఏయంఒ శ్రీనివాస్ జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్,జిల్లా అధికారులు,ఉపాధ్యాయులు పాల్గొని నివాళులు అర్పించారు.



జడ్చర్ల ఎంఈఓ మంజుల దేవిని సన్మానిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

# కొత్తపల్లి మండలంలో చిరుత సంచారం

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మద్దూర్, జనవరి 3 ప్రభాతవార్త :** ఉమ్మడి మద్దూరు మండల పరిధిలోని కొత్తపల్లి మండల కేంద్రంలో గత రాత్రి గొర్రెలపై చిరుతపులి దాడి చేసి ఒక గొర్రెను చంపేసినట్లు గొర్రెల కాపరులు ఫారెస్ట్ సెక్షన్ అధికారికి తెలియజేశారు. ఫారెస్ట్ అధికారి శుక్రవారం రోజు ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కొత్తపల్లి మండల ప్రజలు రాత్రిపూట వేళల్లో ఎట్టి పరిస్థితుల్లో బయటకు రావద్దని వచ్చినా అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలను కోరారు. బాధితునికి ప్రభుత్వం తరపున నష్టపరిహారం ఇప్పించాలని గ్రామస్తులు కోరారు.



చిరుత సంచరించిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

# సమ్మె ఇలా..

# సదువులెలా..!



సమ్మెలో పాల్గొన్న సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు

- సమగ్ర ఉద్యోగుల పోరుబాటతో స్తంభించిన విద్య వ్యవస్థ
- పరీక్షల సమయంలో విద్యార్థుల అయోమయం
- సర్వ శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న అధ్యాపకులకు రెగ్యులర్ చేసేంతవరకు సమ్మె విరమించేది లేదని ఉద్యోగులు డిమాండ్
- టీచర్లను సర్దుబాటు చేసేందుకు విద్యాశాఖ అధికారుల ప్రయత్నాలు
- కేంద్ర ప్రభుత్వం ఇటీవల నో డిటెక్షన్ విధానం రద్దు చేసిన దానిపై చర్చ...

**వనపర్తి క్రైమ్ జనవరి 3 ప్రభాతవార్త :** సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె రోజు రోజుకు ఉధృత రూపం దాలుస్తోంది. తమ సర్వీసులను క్రమబద్ధీకరించి తక్షణమే పేస్కేల్ వర్తింపజేయాలని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మె పోరుబాట శుక్రవారానికి 25 రోజుకు చేరింది. దశల వారిగా ఆందోళనలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2500 మందికి పైగా ఉద్యోగులు విధులు బహిష్కరించి నిరసనతో రోడ్డెక్కి నిరవదిక సమ్మెలో పాల్గొన్నారు. దీంతో కస్తూర్బా పాఠశాలలో పరీక్ష సమయంలోనే బాలికలకు చదువులు అడుగట్టిపోతున్న పరిస్థితులు దాపరిస్తున్నాయి. కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగ మారింది. ఇక బడుల్లో పర్యవేక్షణ కొరవడం మధ్యాహ్నం భోజనం బిల్లులు నిలిచిపోవడంతో చదువులపై సమ్మె ప్రభావం చూపుతోంది.

**ప్రభుత్వం స్పందించే వరకు విరమించని సమ్మె..**

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 2006లో సమగ్ర శిక్ష ఏర్పాటయింది. జిల్లాలో కేజీబీవీ బోధనేతర, బోధన సిబ్బంది, ఎంఐఎస్ సమన్వయకర్తలు, సిపిఓలు, సీఆర్పీలు, ఐఈఆర్పీలు, మెసెంజర్లు, పిటిఐలు, సిజీవీలు ఉద్యోగాలుగా పనిచేస్తున్నారు. విద్యాశాఖ పర్యవేక్షణలో నిరంత సేవలందిస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్నారు. విద్యాశాఖలో విలీనం చేసిన తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కొన్నేండ్లుగా కోరుతున్నా రు. ఈ డిమాండ్లతో గత ఏడాది సమ్మె కూడా చేశారు. అప్పట్లో వీరి సమ్మెలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతు ప్రకటించారు. తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన ఆ హామీ నెరవేరకపోవడంతో సమగ్ర శిక్ష ఉద్యోగులు మళ్లీ సమ్మెబాట పట్టారు.





సమ్మెలో ప్లాకార్డ్ పట్టుకొని చూపిస్తున్న చిన్నారి

**ప్రధాన డిమాండ్లు....**

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి.ఉద్యోగ భద్రత కల్పించాలి , పే స్కేల్ అమలు చేయాలి.ప్రతి ఉద్యోగికి జీవిత బీమా, ఆరోగ్య భీమా అమలు చేయాలి. మహిళా ఉద్యోగులకు 180 రోజులు మెటర్నిటీ లీవ్స్ ఇవ్వాలి. పిటిఐలకు మిగతా ఎస్ఎస్ఏ ఉద్యోగులకు 12 నెలల వేతనం చెల్లించాలి.

**ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి...**

చంద్రశేఖర్ సమగ్ర శిక్ష ఉద్యోగులు జిల్లా అధ్యక్షుడు ఎండి, వహీద్ సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి మా ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తానని గతంలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు ఇప్పుడు హామీని నిలబెట్టుకోవాలని, పే స్కేల్ అమలు చేయాలి. మా డిమాండ్లపై ప్రభుత్వ స్పందించే వరకు సమ్మె విరమించం.



సమ్మె చేస్తున్న ఉద్యోగులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి ( ఫైల్ ఫొటో)

## బాలికలు, మహిళలు సావిత్రిబాయి పూలే

# ఆశయ బాటలో నడవాలి

- ఆదర్శ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 194వ జయంతి
- మహిళ విద్యాప్రదాతకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో సావిత్రిబాయి పూలేకు నిజమైన నివాళి
- నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 03 ప్రభాతవార్త:** సామాజిక సంస్కర్త, ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డిలు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అధికారికంగా నిర్వహించిన మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆ మహానీయురాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌లు తెలిపారు. శుక్రవారం సావిత్రి బాయి ఫూలే 194వ జయంతి సంధర్భంగా, జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో సాంఘిక సమానత్వం కోసం జీవితాంతం కృషిచేసిన సావిత్రిబాయి పూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా అధికారికంగా ప్రకటించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆమెకిచ్చిన ఘనమైన నివాళి అని నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌లు అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీ విద్యపై ప్రప్రథమంగా గళమెత్తిన ఉద్యమకారిణి, ఆదర్శ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి, అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమించిన సావిత్రిబాయి స్ఫూర్తి అందరికీ ఆదర్శం అన్నారు. ఆనాటి కట్టుబాట్లను కాదని 1848లోనే సావిత్రిబాయి పూలే పూణేలో మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించడం అనేది అసామాన్య విషయమని పేర్కొన్నారు. మహిళలకు విద్య అందకుండా చేసిన కట్టుబాట్లను చేధిస్తూ 1848 లో దేశంలోనే మొదటి బాలికల పాఠశాలను ఏర్పాటు చేసి, తదానంతరం 52 పాఠశాలలకు విస్తరింపజేసిన ఘనత ఆమెదేనన్నారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం లెక్కచేయకుండా సమష్టిగా పోరాటం చేసినట్లు, వితంతువులకు శిరోముండనం చేయడాన్ని వ్యతిరేకించి, ఉద్యమం నడిపి విజయం సాధించిన ధీరవనిత అని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్, నాగర్ కర్నూల్ మండల విద్యాధికారి భాస్కర్ రెడ్డి, నోడల్ అధికారి కురుమయ్య, సెక్టోరియల్ అధికారులు షర్ఫుద్దీన్, వెంకటయ్య, శోభారాణి, వెంకటేశ్వర్లు, ఎస్ జి ఎఫ్ సెక్రటరీ పాండు, ప్రధానోపాధ్యాయురాలు లత మహిళా ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

# మహిళా ఉపాధ్యాయినీలకు సముచిత గౌరవం

## అణగారిన వర్గాల బతుకులు మార్చిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే: వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి జనవరి 03 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని మహిళా ఉపాధ్యాయినీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం సముచి తంగా గౌరవించిందని, జనవరి 3న నిర్వహించే సావిత్రిబాయ్ పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షించదగ్గ విషయమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని హరిజనవాడ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కాంప్లెక్స్ లెవెల్ టిఎల్ఎం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల బతుకులు మార్చిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని ఆయన అన్నారు. భారతదేశ మొదటి ఉపాధ్యాయురాలుగా మహిళ లోకానికి ఎన్నో గొప్ప సేవలందించిన త్యాగమూర్తి సావిత్రిబాయి పూలే అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళా ఉపాధ్యాయినీలను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన విజ్ఞాన ప్రదర్శనను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు అందరూ చదువుతోపాటు ఆటపాటలపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు టై బెల్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని, వనపర్తి పట్టణ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పట్టణ కౌన్సిలర్లు, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు మహిళా అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయినీలను శాలువాలతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే

# రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం

## ముంపు గ్రామాల సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపిస్తాం

## ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

## గతంలో ఎన్నడూ లేనంతగా మక్తల్‌ను అభివృద్ధి చేస్తా

## మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి

**మక్తల్, జనవరి 3 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అహర్నిశలు పనిచేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మక్తల్ మార్కెట్ కమిటీ నూతన చైర్ పర్సన్ గవినోళ్ల రాధా లక్ష్మారెడ్డి, పాలకవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం పట్టణంలోని నెహ్రూగంజ్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన అతి తక్కువ కాలంలోనే రైతాంగానికి రుణమాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో లక్షల కోట్ల ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని అన్నారు. దీన్ని చక్కదిద్దేందుకే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. త్వరలోనే రైతులకు రైతుభరోసా అందజేస్తామన్నారు. అంతకు ముందు మక్తల్ మండలం లోని భూత్పురు,మాగనూరు మండలంలోని నేరేడగం గ్రామాలను స్థానిక ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరితో కలిసి మంత్రి పరిశీలించారు. ముంపు -మిగతా4లో..



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

# అభివృద్ధి పథంలో పాలమూరు

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 3 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని పలువురు చైర్మన్లు అన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్‌తో కలిసి మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబ్‌నగర్ లో ప్రధానంగా విద్య,వైద్య, ఉపాధి తోపాటు వ్యవసాయం అభివృద్ధి పైన ఎమ్మెల్యే అత్యంత శ్రద్ధ చూయిస్తున్నారని అన్నారు. నియోజకవర్గం లోని ప్రతి పేద విద్యార్థి చదువు మధ్యలో ఆగిపోకుండా ఉండే విధంగా మహబూబ్ నగర్ విద్యానిధిని ఎమ్మెల్యే ఈ నూతన సంవత్సరం సందర్భంగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈవిద్యానిధి పేదవిద్యార్థుల చదువుకు,పాఠశాలల అభివృద్ధికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్,డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సిజె బెనహర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు వసంత, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, క్రిస్టియన్ మైనారిటీ పట్టణ అధ్యక్షులు శ్యామ్యుల్, నాయకులు నవనీత, సహజ, ప్రవీణ్ కుమార్‌తో పాటు రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ లయన్ నటరాజ్ రెడ్ క్రాస్, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి జన్మదిన -మిగతా4లో..



కేక్ కట్ చేస్తున్న చైర్పర్సన్ బెక్కరి అనితారెడ్డి

## ఎక్సలెన్షియా స్కూల్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంఈఓ

**జడ్చర్ల ,జనవరి 3 ప్రభాతవార్త:** జడ్చర్ల మండల కేంద్రంలోని నూతన నంగా నెలకొల్పిన ఎక్సలెన్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ క్యాలెండర్‌ను శుక్రవారం ఎంఈఓ మంజులాదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. జనవరి 3 సావిత్రిబాయి పూలే మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాల మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలోపాఠశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి,ప్రిన్సిపాల్ పావని,ఉపాధ్యాయులు జగదీష్, సంధ్య, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు అయుబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ మంజుల దేవి

## కొత్తకోటలో టీడీపీ సభ్యత్వల నమోదు

**కొత్తకోట జనవరి 03 ప్రభాతవార్త :** కొత్తకోట పట్టణ కేంద్రంలో శుక్రవారం షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వల నమోదు కార్యక్రమం నిర్వహించారు. కొత్తకోటకు తెలంగాణ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సందర్భంగా టీడీపీ నాయకులతో కలిసి సభ్యత్వాలు స్వీకరించారు. తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యస్.టి.సెల్. ప్రధాన కార్యదర్శిగా పని చేసిన కిషన్ నాయక్ నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మండలంలో అత్యధిక సభ్యత్వాలు చేసిన సందర్భంగా బక్కని నర్సింహులు కిషన్ నాయక్ ను శాలు కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. తెలంగాణ రాష్టంలో టీడీపీ పార్టీ బలోపేతం కావాలని అందుకు సభ్యత్వాలు పెద్ద ఎత్తున చేయాలనీ కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ కట్ట వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు రాఘవులు, దామోదర్ రావు, చంద్రమోహన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


కిషన్ నాయక్ ను సన్మానిస్తున్న బక్కని నర్సింహులు

## కాంట్రాక్ట్ అధ్యాపకులకు యుజిసి పేస్కేల్ అమలు పరచాలి : పీయూ అధ్యాపకులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 3 ప్రభాతవార్త:** యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకులకు యూజీసీ పే స్కేల్స్ అమలుపరచాలని పియు ఒప్పంద అధ్యాపకులు డిమాండ్ చేశారు. పాలమూరు యూనివర్సిటీలోని పీజీ కాలేజీ యందు లెక్చర హాల్ 3లో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్టంలోని 12 యూనివర్సిటీలలో పనిచేస్తున్న 1445 మంది ఒప్పంద అధ్యాపకులకు అధ్యాపకులకు ఉద్యోగ భద్రతతో కూడిన బేసిక్ +డి ఎ + హెచ్ ఆర్ ఎ +3 ఇంక్రిమెంట్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాలమూరు యూనివర్సిటీ పరిధిలో 94 మంది అధ్యాపకులము ఎన్నో ఏళ్లుగా చాలీచాలని జీతంతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక ఎలాగైనా క్రమబద్ధీకరిస్తారని ఆశతో ఉన్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వము కేవలం జూనియర్ లెక్చరర్స్, డిగ్రీ లెక్చరర్స్ మాత్రమే మాత్రమే క్రమబద్ధీకరించి యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకులను విస్మరించిందనీ, ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం గడిచినా ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినా ఇంతవరకు యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకుల పై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఒప్పంద అధ్యాపకులకు యూజీసీ స్కేల్ అమలుపరిచిన తర్వాతనే మిగిలిన పోస్టులను నోటిఫికేషన్‌కి వెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించలేని ఎడలో ఆందోళలు ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఒప్పంద సంఘం నాయకులు డా. రవి కుమార్, డా. పర్వతాలు, డా. సుదర్శన్ రెడ్డి,డా. సోమేశ్వర్,అధ్యాపకులు డా. చంద్రశేఖర్, డా. గౌస్ మొయిద్దీన్,డా. మాధురి మోహన్, డా.అయేషా హష్మీ, డా. రామ్మోహన్, డా. చెన్నయ్య, పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బాటలో మేము..

**మహబూబ్‌నగర్ విద్య నిధికి రూ.50 వేల విరాళం అందజేసిన మల్లు నరసింహారెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 3 ప్రభాతవార్త:** కలెక్టర్ విజయేందిర బోయిని కలిసి విద్యానిధికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పిలుపు మేరకు రూ. 50,000/ల చెక్కు ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మంచి ఆలోచన చేసి విద్యా నిధి ఏర్పాటు చేశారని, ఇది ఎంతో గొప్ప కార్యక్రమం అని, ప్రతి ఒక్కరు స్పందించి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ఆయన మహబూబ్ నగర్ ప్రజలను కోరారు. మల్లు నర్సింహ్మారెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు రూ.50 వేల చెక్కు అందజేస్తున్న నరసింహారెడ్డి

## రైతులకు సాగునీరు ఇవ్వడమే ప్రభుత్వ ధ్యేయం

**డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్**

**అమరచింత డిసెంబరు 03 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముందుకెళ్తున్నారని డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్ అన్నారు. శుక్రవారం అమరచింత పెద్ద చెరువు తూము దగ్గర రైతులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చెరువు ఆయకట్టుదారులకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమరచింత పెద్ద చెరువు ఆయకట్టు కింద ఉన్న 530 ఎకరాలు చెరువు నీటి వల్ల పంటలు సాగవుతున్నాయని ఆయన అన్నారు. రైతులు ఎలాంటి రాగద్వేషాలు లేకుండా కలిసికట్టుగా చెరువు ఆయకట్టు రైతులు పొదుపుగా నీటిని వాడుకోవాలని ఆయన కోరారు. అలాగే అమరచింత చెరువు అభివృద్ధికి మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్ సహకారంతో భూత్పూర్ రిజర్వాయర్ నుండి సాగునీటిని రైతులకు విడుదల చేయడం పట్ల ఆయన వారికి అభినందనలు తెలిపారు. చెరువు ఆయకట్టుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో అమరచింత పెద్ద చెరువు ఆయకట్టుదారుల సంఘం అధ్యక్షులు పోసిరి విష్ణు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్ ,కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు తౌఫిక్ ,ఎస్టీసెల్ మండల అధ్యక్షులు హనుమంతు నాయక్ ,అష్షు ఇరిగేషన్ తిని ఆంజనేయులు ,వర్క్ ఇన్స్పెక్టర్ డి సి దామోదర్ ,ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.


పెద్ద చెరువు నుండి ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల

## మహిళలు సమాజం కోసం పనిచేయాలి

**వనపర్తి టౌన్ జనవరి 03 ప్రభాతవార్త :** సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో సమాజ మార్పు, మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు) ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు ఈ కళావతమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఐ ఆఫీసులో ఎన్‌ఎఫ్‌ఐ డబ్ల్యు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే 194వ జయంతి వేడుకలను నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళావతమ్మ మాట్లాడుతూ 1848లో పూణేలో తొలి బాలికల పాఠశాలను ఏర్పాటు చేసి దేశంలోని తొలి మహిళా టీచర్ గా చదువులు చెప్పారన్నారు. 20 పాఠశాలలు స్థాపించి దళితులు బాలికల విద్య కోసం కృషి చేశారన్నారు. స్త్రీ విద్య ద్వారా దేశ పురోగతి సాధ్యమవుతుందని భావించారన్నారు. కుల వివక్ష, అంటరానితనం, మూఢనమ్మకాలు, స్త్రీ విద్య కోసం ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని పనిచేశారని ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 3 ఆమె జన్మదినం సందర్భంగా రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవం గా ప్రకటించటం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ కన్వీనర్ జయమ్మ కో కన్వీనర్ శిరీష, నాయకులు జయశ్రీ, శ్రీదేవి, జ్యోతి, నాగమణి, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీ రామ్, శ్రీహరి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# గొప్ప స్ఫూర్తి ప్రదాత సావిత్రి బాయి పూలే



సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


పూలె జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


సావిత్రిబాయి పూలె జయంతిలో నాయకులు

**దేవరకద్ర, జనవరి 3 ప్రభాతవార్త :** భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే యావత్తు సమాజానికే గొప్ప స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని జూనియర్ రెడ్ క్రాస్ సమన్వయ కర్త, పి ఆర్ టి యూ టి ఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అశ్విని చంద్రశేఖర్ అన్నారు. ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే 194 వ జయంతి వేడుకలను పురస్కరించుకొని రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసిన సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి ఉపాధ్యాయులు,విద్యార్థులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సావిత్రి బాయి పూలే జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎస్.కల్పన, రెడ్డిగారి బిజిలి విజయలక్ష్మి అదేవిధంగా ఉన్నత పాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ లు అస్రఖాద్రి, సుజాతలను శాలువాలతో ఘనంగా సత్కరించి విలువైన పుస్తకాలను బహుకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జూనియర్ రెడ్ క్రాస్ సమన్వయ కర్త, పిఆర్‌టియూ టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే జీవిత చరిత్ర గొప్ప తనం గురించి విద్యార్థులకు వివరించారు. సావిత్రి బాయి పూలే అనేక ఆటంకాలు, అవమానాలను ఎదిరించి చదువుకోవడంతో పాటు విద్యాభివృద్ధికి ఆమె చేసిన కృషి మరువ లేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ ఎం కేకే శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల హెచ్ ఎం ఎస్.కల్పన, ఉపాధ్యాయులు కోటకద్ర మురళీధర్, శంకర్, విజయ లక్ష్మి, అస్ర ఖాద్రి, సుజాత, అశ్విని చంద్రశేఖర్, నాగేశ్వర్‌రెడ్డి, కమల్‌రాజ్, విద్యా వాలంటీర్ వెంకట్రాములు, ఓఎస్ అహ్మద్ బిన్ ఇషాక్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**బాలానగర్, జనవరి 3 ప్రభాతవార్త :** హెల్ప్ సంస్థ మరియు ఎన్ఎస్ఎస్ యూనిట్ బాలానగర్ ఆధ్వర్యంలో ఈరోజు ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలానగర్ నందు సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి బాయి పూలే గొప్పతనాన్ని ఆమె సాధించిన ఘనతను గురించి ప్రిన్సిపాల్ రమేష్ లింగం విద్యార్థులకు తెలియజేశారు.హెల్ప్ సంస్థ నిర్వాహకులు నర్సింలు, పరమేశ్వరి, రాజు గౌడ్ ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మెడిటేషన్, యోగా సాధన చేయించి, ఏకాగ్రతకు యోగ ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలియజేశారు. ధ్యానం వల్ల ఏకాగ్రత పెరగడం గుండె నిబ్బరం మరియు మానసిక, శారీరిక సామర్థం వృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రకాంత్, వినోద్, మరియు ఉపాధ్యాయినిలు అనురాధ, మీనా, రమ్య తదితరులు పాల్గొన్నారు.

**కృష్ణ, జనవరి 3 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలోని, కృష్ణ మండలం, ముడుమాల గ్రామంలో సావిత్రిబాయి పూలే గారి జయంతి వేడుకలలో భాగంగా, ముడుమాల అంబేద్కర్ యువజన సంఘం తరపున చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు తిమ్మప్ప మాట్లాడుతూ, మహిళా విముక్తి కోసం పాటుపడిన సావిత్రీబాయి పూలే గారు మహిళల కోసం ఉపాధ్యాయ వృత్తికి ఆమె అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వి తిమ్మప్ప, గ్రామస్తులు కె.మహదేవ్, డీ రాము, డీలర్ భారతి, ఎం. ఓబులేష్, ఎస్.మారెప్ప, శ్రీను, కే రంగప్ప, నారాయణ,మహేష్,అంజప్ప,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**ధన్వాడ, జనవరి 3 ప్రభాతవార్త:** భరతమాత ముద్దుబిడ్డ, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి , మహిళా విద్యాభివృద్ధికి మార్గదర్శి నిత్య స్ఫూర్తి ప్రదాత సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకొని ధన్వాడ మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత బాలికల పాఠశాల ఆవరణలో మహాత్మ జ్యోతిరావు పూలే విద్యాభివృద్ధి సంఘం అధ్యక్షులు నీరటి రాఘవేందర్ నాయుడు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జడల బాల్ రాజ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నీరటి నర్సిములు నాయుడు ముదిరాజ్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు , రాజు కాంగ్రెస్ యువజన మండల అధ్యక్షులు, సంద బాలనర్సన్న మత్స్య శాఖ ధన్వాడ ఉపాధ్యక్షులు, మాణిక్యాల శివరాములు మాజీ వార్డ్ నెంబర్ వై వెంకటేష్ సమాచార హక్కు చట్టం రాష్ట్ర అధ్యక్షులు, గుర్రం రాజు బిఎస్‌పి నాయకులు, కురువ నవీన్ బిఆర్ఎస్ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయినీలు, సంధ్యారాణి, తులసమ్మ ,శ్రావణి, అంజయ్య ఆ పాత్రికేయులు, గువ్వలపల్లి కురుమన్న నీలప్ప, పాఠశాల విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పునుంతల, జనవరి 3 ప్రభాతవార్త :** భారతదేశం మొట్ట మొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రి భాయి పూలే 194 వ జయంతి శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక బాలుర పాఠశాలలో సావిత్రి భాయి పూలే జయంతి వేడుకల సందర్భంగా మహిళ ఉపాధ్యాయులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అంతకుముందు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళలందరికీ విద్యను అందించేందుకు 1848 సంవత్సరంలో ఆమె భర్త మహాత్మా జ్యోతిరావు పూలేతో కలిసి మొట్టమొదటిసారి పాఠశాలను స్థాపించి 1852 వరకు 52 పాఠశాల ద్వారా వేల మంది విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడంతోపాటు, అన్ని రకాల వివక్షతలకు తొలగించేందుకు పోరాడి, మూఢనమ్మకాలను, సామాజిక రుగ్మతలను రూపు మాపి కోట్లాది పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని ఆయన అన్నారు. పోలే దంపతుల స్ఫూర్తితో విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి సభ్య సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులు చందన,సంగిత లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులుతో పాటు గాజుల వెంకటేష్, చందన, సంగీతలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**మక్తల్ టౌన్, జనవరి 3 ప్రభాతవార్త:** మహిళ అభ్యుదయ వాది మొట్ట మొదటి జాతీయ మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 194 వ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్‌లో చిత్ర పటానికి పూల మాలాలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కర్రెమ్ కుర్మయ్య, సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సావిత్రి బాయి పూలే సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు చిన్న హనుమంతు, జట్ల శంకర్, యువ నాయకులు సాగర్, జె.నర్సిములు, జె.సాగర్, అంబేద్కర్ యువజన సంఘం సహాయ కార్యదర్శి జగదీశ్, రిపోర్టర్ కావాలి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు జనవరి 03 ప్రభాతవార్త :** భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జన్మ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవం గా ప్రకటించడంతో శుక్రవారం రోజు మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ భాగ్యవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రభుత్వం ప్రకటించడం పట్ల హస్యం ప్రకటించారు. మహిళలు అన్ని రంగాలలో పురుషులకు పోటీ పడుతున్న నేపథ్యంలో విద్యార్థినీ విద్యార్థులు కూడా మహిళలోకానికి సరైన గుర్తింపు లభించేలా తమ వంతు కృషిచేసి ప్రభుత్వ ప్రతిష్టను కాపాడాలని ఆయన సూచించారు ఈ సందర్భంగా మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు పావని,వీణ,వాణి తదితరులతో పాటుగా కళాశాల సిబ్బంది విశ్వేశ్వర్ ,కురుమూర్తి ,రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానిస్తున్న దృశ్యం


సావిత్రిబాయిపూలె జయంతి వేడుకలలో విద్యార్థులు


ఉప్పునుంతలలో ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం


సావిత్రిబాయి పూలె జయంతి వేడుకల్లో యువజన సంఘం సభ్యులు

## ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎస్టీయు క్యాలెండర్ ఆవిష్కరణ

**ఉప్పునుంతల,జనవరి3 ప్రభాతవార్త:**ఎస్టీయు పిజిక్యాలెండర్ 2025 ను శుక్రవారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టియు) డైరీ, క్యాలెండర్లను నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్‌రావు, సంఘ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ నైతిక విద్య, అవశ్యకతను తెలుపుతూ సమాజ విలువలను పెంపొందించాలని, తొలి ఉపాధ్యాయ సంఘంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పట్ల నిబద్ధత గల సంఘముగా పేరు ఉన్నదని, మహిళా ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా నాగర్‌కర్నూల్‌జిల్లా ఎస్టీయు జిల్లాప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఆధునిక యుగంలో అణగారిన వర్గాల శ్రేయసు కోరి, బాలికల పాఠశాలను స్థాపించి, సంఘసంస్కర్తగా, రచయిత్రిగా రాణించి, తొలితరమైన ఉపాధ్యాయురాలుగా చరిత్ర సావిత్రిబాయి పూలే జయంతి ని రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ప్రకటించిన పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. విద్యారంగం బోధనలో సగానికి పైగా మహిళా ఉపాధ్యాయులు ఉండడం పట్ల వారు ప్రత్యేకంగా ఆర్య వ్యక్తం చేశారు. నేటి సమాజానికి ఆధునిక విద్య తోపాటు, నైతిక విద్య క్రమశిక్షణతో కూడిన సౌభ్రాతృ విలువలతో పాటు పరమత సహనం, రాజ్యాంగ విలువల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకొని బాలికల విద్యను ప్రోత్సహించాలని ఆయన కోరారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్టి యు ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్ రావు, అచ్చంపేట మాజీ ఎంపీపీ రామనాథం, సంఘ ప్రతినిధులు హనుమంత్‌రెడ్డి, లక్ష్మారావు, పోకల సతీష్, అర్జునయ్య, శంకరయ్య, సింగోటం, పాండునాయక్, విక్రం, సుందరయ్య, రవి శేఖర్, రాజు, సుదర్శన్, నారాయణ గౌడ్, శ్రీనివాసులు, బోడ రవీందర్, అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడుపాల గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎస్టియు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

## పోలీసుల పహారాలో గ్రామసభ ఏర్పాటు..

**వసరాం తండా నూతన గ్రామపంచాయతీ ఏర్పాట్లు పట్టించుకోని అధికారులు**

**ఖిల్లాఘణపురం జనవరి 03 ప్రభాతవార్త :** మల్కిమియాన్ పల్లి గ్రామంలో శుక్రవారం పోలీసుల బందోబస్తు మధ్యన పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభను ఏర్పాటు చేశారు. గ్రామస్తుల కథనం ప్రకారం. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం 20 లక్షల నిధులు మంజూరు అయినవి. స్థల సేకరణ ఆలస్యం కావడం ఎమ్మెల్యే ఎన్నికలు రావడంతో పంచాయతీ భవనం వాయిదా పడింది. గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం కోసం ఇటీవల జిల్లా అధికారులతో ఒత్తిడి రావడంతో పది రోజుల క్రితం అధికార పార్టీకి చెందిన ఓ మండల నాయకుడు కొంతమంది గ్రామస్తులు పల్లె ప్రకృతి వనంలో చెట్లను తొలగించి జిపి భవనం ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారు. ఎంపీడీఓ వెంకటాచారికి విషయం తెలియడంతో ప్రకృతి వనం తొలగింపును అడ్డుకున్నారు. డిసెంబర్ 30న 50 మంది గ్రామస్తులు ప్రజావాణిలో పార్కులు తొలగించవద్దని పార్కుకు ఇరువైపులా ఉన్న స్థలాలలో జి పి భవనం నిర్మించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం జిపిడిపి వార్షిక ప్రణాళిక పై పంచాయతీ కార్యదర్శి గ్రామసభను ఏర్పాటు చేశారు. జిపి భవనం కోసం గొడవలు జరుగుతాయని ఉద్దేశంతో అధికార పార్టీకి చెందిన నాయకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై సురేష్ గౌడ్ తన సిబ్బంది ఏఎస్ఐ మరో ఎనిమిది మంది పోలీసులతో గ్రామసభకు బందోబస్తును ఏర్పాటు చేశారు. గ్రామసభ అనంతరం పలువురు గ్రామ యువకులు పార్కులు తొలగిస్తే ఊరుకోమని ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని వాటిలో జిపి భవనం నిర్మించాలని కార్యదర్శికి చెప్పారు


మల్కిమియాన్ పల్లి లో గ్రామసభ జరుగుతున్న దృశ్యం

**నూతన గ్రామపంచాయతీ నిర్మాణం కోసం 20 లక్షల నిధులు మంజూరు**

మల్కిమియాన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వసరాం తండా సూర్య తండా దేవ బండ తండాలను కలిపి వసరాం తాండలు నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసినట్లు గవర్నర్ గెజిట్ ఆమోదించారు. రెండు నెలల క్రితం జిల్లా కలెక్టర్ నూతన గ్రామపంచాయతీని గుర్తిస్తూ మల్కిమియన్ పల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిని ఇన్చార్జిగా నియమించారు, స్పెషల్ ఆఫీసర్ గా మండల విద్యాధికారిని నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబర్ 22న నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 20 లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయినా ఇంతవరకు జిల్లా మండల స్థాయి అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయడం లేదని తాండావాసులు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వసరం తాండలో జిపి భవనం తాత్కాలికంగా స్కూల్ భవనంలో ఏర్పాట్లు చేస్తే గ్రామంలో ఎలాంటి గొడవలు ఉండవని గ్రామస్తులు తెలియజేస్తున్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కొత్తపల్లి తహసీల్దార్

**మద్దూర్ జనవరి 3 ప్రభాతవార్త :** ఉమ్మడి మద్దూర్ కొత్తపల్లి మండల పరిధిలోని నిడ్జింత గ్రామంలో శుక్రవారం రోజు కొత్తపల్లి తాసిల్దార్ అనిల్‌కుమార్ జిల్లా పరిషత్ హైస్కూల్ లో మధ్యాహ్న సమయంలో మధ్యాహ్న భోజన పథకం ఆహారం ఏ విధంగా ఉందని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం బియ్యం స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని వంట చేసే వారికి తహసిల్దార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.


సరుకులను పరిశీలిస్తున్న తహసీల్దార్

## భూత్పూర్‌లో 'శ్రీకృష్ణాంజనేయ యుద్ధం' పౌరాణిక నాటక ప్రదర్శన

**భూత్పూర్,జనవరి 3,ప్రభాతవార్త :** శనివారం నాల్గో తేదీన సా యంత్రం ఐదు గంటలకు భూత్పూర్ పట్టణ కేంద్రంలోని శ్రీహనుమాన్ దేవాలయ ప్రాంగణంలో మహబూబ్‌నగర్ జనతా సేవా సమితిచే ప్రముఖ జర్నలిస్టు వీడీఎస్ రాజు ప్రధాన భూమిక శ్రీకృష్ణ పాత్రను పోషిం చే 'శ్రీకృష్ణాంజనేయ యుద్ధం' పౌరాణిక నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు శ్రీబ్రహ్మానంద నాటక ఆకాడెమి గౌరవాధ్యక్షుడు మురళీధర్‌గౌడ్ తెలిపారు. భూ త్పూర్ పట్టణ ప్రజలు,కళాపోషకులైన నాయకుల సహకారంతో నిర్వహిస్తున్న ఈ నాటక ప్రదర్శనను అందరూ వీక్షించాలని మురళీధర్‌గౌడ్ కోరారు.

## మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

**మైనారిటీ వెల్ఫేర్ అధికారి రమేష్ బాబు**

**గద్వాల, జనవరి 03 ప్రభాతవార్త :** తెలంగాణ మైనారిటీ సంక్షేమ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్ 1,2,3,4, ఆర్ ఆర్ బి, ఎస్ ఎస్ సి, బ్యాంకింగ్ ఇతర ఉద్యోగాల భర్తీకై పోటీ పరీక్షల నిమిత్తం నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి యం.పి. రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మైనారిటీ నిరుద్యోగ యువత దరఖాస్తుకు సంబంధిత ధృవ పత్రాలను జత చేసి ఈనెల 7వ తేదీ సాయంత్రం 5.00 గంటలలోగా జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయము, రూమ్ నెం.8 ఐ డి ఓ సి కాంప్లెక్స్ నందు సమర్పించాలని ఆయన కోరారు.

# బీచుపల్లి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాల్సిందే

## మరోసారి రోడ్డెక్కిన బీచుపల్లి గురుకుల విద్యార్థులు.. ధర్నాను విరమింప జేసిన పోలీసులు

**ఇటిక్యాల, జనవరి 3 ప్రభాతవార్త :** మండల పరిధిలోని బీచుపల్లి రెసిడెన్షియల్ గురుకుల కళాశాలలో పనిచేస్తున్న ప్రిన్సి పాల్ ను కచ్చితంగా సస్పెండ్ చేయాల్సిందేనని శుక్రవారం ఉదయం గురుకుల విద్యార్థులు మరోసారి రోడ్డెక్కారు. విద్యార్థులను ప్రిన్సి పాల్ వేధింపులకు గురి చేస్తున్నారని ఆయన పనితీరు బాగాలేదని నిరసిస్తూ శుక్రవారం ఉదయం బీచుపల్లి జాతీయ రహదారి రోడ్డు పక్కన ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థులను వేధిస్తున్నారని అలాగే పాఠశాలలో సక్రమంగా భోజనం అందడం లేదని ఇంకా పలు సమస్యలతో పాఠశాల ఉందని ఇలాంటి ప్రిన్సి పల్ మాకొద్దు అంటూ కచ్చితంగా ప్రిన్సి పాల్ ను సస్పెండ్ చేయాల్సిందేనని నినాదాలు చేశారు. విద్యార్థుల ధర్నా విషయం తెలుసుకున్న ఇటిక్యాల పోలీసులు అక్కడికి చేరుకొని విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకుని ధర్నాను విరమింప చేశారు. జిల్లా ఉన్నతాధికారులు విచారించి ప్రిన్సి పల్ పై శాఖ పరమైన చర్యలు తీసుకుంటారని అప్పటిదాకా ఎలాంటి ధర్నా నిరసనలు చేయరాదని విద్యార్థులకు పోలీసులు నచ్చజెప్పి శాంతింపజేశారు. అనంతరం విద్యార్థులు పాఠశాల లోపలికి వెళ్లిపోయారు. అయితే విద్యార్థులు రోడ్డు ఎక్కి గేటు దాటి వస్తున్న అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులు నిలువరించకుండా చేతులెత్తేశారు. కాగా గత నెల డిసెంబర్ 24వ తేదీన ప్రిన్సి పల్ పై చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాల్సిందేనని బీచుపల్లి గురుకుల పాఠశాల నుండి ఎర్రవల్లి చౌరస్తా. అనంతపురం. వీరాపురం. జమ్మిచెడ్ మీదుగా దాదాపు 20 కిలోమీటర్ల మేర ఇంటర్, టెన్త్,8,9 తరగతులకు చెందిన దాదాపు 200 మంది విద్యార్థులు కాలినడకన జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని ప్రధాన గేటు ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్‌తో 20 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. ఇందులో ప్రిన్సి పాల్ పై విద్యార్థులు వారికున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. అలాగే ఉపాధ్యాయుల నుండి కూడా పాఠశాలలో జరుగుతున్న సమాచారాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సి పాల్ పై చర్యలు తీసుకునేందుకు జిల్లా కలెక్టర్ కమిటీని ఏర్పాటు చేయగా గురువారం విచారణ కమిటీ సభ్యులు పాఠశాలలో విచారించినట్లు తెలుస్తుంది.



ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని రోడ్డు పక్కన కూర్చొని బైఠాయించిన విద్యార్థులను శాంతింప చేస్తున్న పోలీసులు



ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని నిరసిస్తూ జాతీయ రహదారి రోడ్డు పక్కన బైఠాయించిన గురుకుల విద్యార్థులు

## వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణకు సన్మానం

**కల్వకుర్తి, జనవరి 03 ప్రభాతవార్త:** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ నూతన అధ్యక్షునిగా శుక్రవారం ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాదులోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ సిద్ద సూర్యప్రకాశరావులను సెక్రటరీ ట్రెజరర్‌లను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రామకృష్ణ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణను, జిల్లా వైస్ గవర్నర్ కల్మిచర్ల రమేష్‌ను సత్కరించారు. రాబోయే రోజుల్లో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే సామాజిక సేవలో ఆర్యవైశ్య మహాసభ సహకారం ఉంటుందని జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు సుదర్శన్, యాదనాగేశ్వరరావు, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జూలూరు రమేష్ బాబు, హకీమ్ రాజేష్, హరికృష్ణ, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



బచ్చు రామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

## కళ్యాణ లక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు వరం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 3 ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఒక వరమని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిజినపల్లి, తిమ్మాజిపేట్ మండలాల సంబంధించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి లబ్దిదారులకు చెక్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పైరవీలకు అవకాశం లేకుండా, పారదర్శకంగా పార్టీలకతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలియజేశారు. ఎవరైనా పైరవీలు చేస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తే తన మన అని చూడకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా తీసుకున్నట్లు తెలిస్తే తన దృష్టికి తీసుకొని రావాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

## ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

**పెబ్బేరు జనవరి 3 ప్రభాతవార్త :** పెబ్బేరు పురపాలక సంఘంలో అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ పర్యటించారు. పట్టణంలోని ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌ను సందర్శించి అక్కడ బిల్డింగ్ పరిస్థితి గురించి తెలుసుకున్నారు. పక్కనే నిర్మాణం లో ఉన్న మున్సి పల్ షట్టర్ కాంప్లెక్స్ యొక్క స్టేటస్‌ను మున్సి పల్ చైర్ పర్సన్ కరుణ శ్రీ సాయినాథ్ అడిషనల్ కలెక్టర్ కి వివరించారు. అనంతరం నిర్మాణ దశలో ఉన్న నూతన వెజ్ మార్కెట్ ను సందర్శించి కాంపౌండ్ చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమం లో వైస్ ఛైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్లు పార్వతిదేవి, చిన్న ఎల్లారెడ్డి, మున్సి పల్ కమిషనర్ గణేష్ బాబు, మున్సి పల్ అసిస్టెంట్ ఇంజనీర్ చంద్ర శేఖర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు, స్థానిక వైద్య అధికారి శ్రీ హరినాథ్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ ,వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి అనిల్ కుమార్, జూనియర్ మార్కెట్ సూపర్వైసర్ నిరంజనమ్మ, మున్సి పల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

## కల్వకుర్తి ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో దాడులు

**-780 బెల్లం స్వాధీనం రెండు కేసులు నమోదు**

**కల్వకుర్తి, జనవరి 03 ప్రభాతవార్త:** కల్వకుర్తి ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జెపినగర్, భగత్‌సింగ్ తండాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సిఐ జె.వెంకటరెడ్డి తెలిపారు. ఈ దాడులలో జెపినగర్ తండా శివారులో 26 బస్తాలు 780 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అదే విధంగా 200 లీటర్ల బెల్లం పానకం, 10 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేసి 2 కేసులు నమోదు చేసినట్లు సీఐ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఐ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా అక్రమంగా బెల్లం సరఫరా చేసిన, నిల్వ ఉంచిన, నాటు సారా తయారీ కేంద్రాలపై విస్తృతంగా దాడులు నిర్వహిస్తామని, కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ దాడులలో ఎస్సై వివేక్, సిబ్బంది నారయ్య, మహేష్, భీమమ్మ, పరుశురాంలు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**దేవరకద్ర, డిసెంబరు 3 ప్రభాతవార్త :** దేవరకద్ర మండలం డోకూరులో శుక్రవారం ప్రేమ్‌కుమార్, సంపత్‌కుమార్‌ల స్మారకార్థం నిర్వహించే స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. శారీరక దేహ దారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహ దపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్ రెడ్డి, నాయకులు కొండ గోవర్ధన్ రెడ్డి, భీంరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఫారూఖ్ ఆలీ, లక్ష్మీకాంత్ రెడ్డిలతోపాటు ఆయా గ్రామాల క్రీడాకారులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనల పట్ల అవగాహన కలిగివుండాలి

**కల్వకుర్తి, జనవరి 03 ప్రభాతవార్త:**విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనువ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలో పలు కలశాలలలో, పాఠశాలలో విద్యార్థలకు జాతీయ భద్రతా మాస ఉత్స వాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్‌స్పెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకంగా కళాశాల విద్యార్థులు రోడ్డు నిబంధనల పట్ల పూర్తిస్థాయిలో ఆకరణ కలిగి ఉండాలని డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు వాహనాలు నడపవద్దని ఆయన సూచించారు. ఈనెల ఒకటి నుంచి 31 వరకు జాతీయ భద్రత మాసోత్స వాలను నిర్వహిస్తున్నామన్నారు. 36వ రోడ్డు భద్రత మాసోత్స వాల్లో భాగంగా సివి రామన్ స్కూల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతకు సంబంధించిన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అనూప్‌రెడ్డి మోటార్ వెహికల్ సిబ్బంది రానా ప్రకాష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయ అభివృద్ధికి తోడ్పాటు : ఎమ్మెల్యే

**బిజినేపల్లి, జనవరి 03 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ అభివృద్ధి కోసం తన వంతుగా తోడ్పాటు అందిస్తానని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి అన్నారు. బిజినేపల్లి అయ్యప్ప ఆలయంలో నిర్వహించిన ఇరుముడి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఇరుముడి పూజలు చేశారు. 41 రోజులు దీక్ష పూర్తిచేసి అయ్యప్పస్వాములు శబరిమలై అయ్యప్పస్వామి దర్శనానికి బయలుదేరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ నాయినోళ్ల బాలరాజ్ గౌడ్ ,మలిశెట్టి వెంకటస్వామి మాజీ సర్పంచ్ గంగన మోని తిరుపతయ్య అమృత్ రెడ్డి మిద్దె రాములు కత్తె ఈశ్వర్, మాన్య నాయక్, శేఖర్, అయ్యప్ప సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. మాజీ జెడ్పిటిసి సుధా పరిమళ బాలరాజ్ గౌడ్ దంపతులు భక్తులకు అన్నప్రసాదం అందించారు.

## పిల్లల రక్షణ, సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**జిల్లా ప్రిన్సిపాల్ జడ్జి బి. పాపిరెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 3 ప్రభాతవార్త:** చిన్నపిల్లల హక్కుల కోసం ఉద్దేశించిన చట్టాల అమలులో భాగంగా పిల్లల రక్షణ, సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ప్రిన్సి పాల్ జడ్జి బి.పాపిరెడ్డి అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలోని సమావేశ మందిరంలో బాలల హక్కులు, చట్టాల అమలు, రక్షణ, సంరక్షణ వంటి అంశాలపై చైల్డ్ ఫ్రెండ్లీ కమిటీ సభ్యులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జడ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణలో ఎలాంటి లోపాలు లేకుండా కృషి చేయాలన్నారు. రెండు రోజులపాటు ఇచ్చే శిక్షణలో బాలల హక్కులు, చట్టాలు, రక్షణ, సంరక్షణ వంటి అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. స్నేహపూర్వకమైన బాలల న్యాయ సేవల పథకం2024 లో భాగంగా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర పర్యవేక్షణలో ప్యానల్ న్యాయవాదులు, ప్యారా లీగల్ వాలంటీర్లు, లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులతో చైల్డ్ ఫ్రెండ్లీ కమిటీని ప్రకటించారు. ఈ మేరకు వాల్ పోస్టర్లను విడుదల చేశారు.

## రాష్ట్ర ప్రజలను మోసగించడంలో టిఆర్ఎస్ కాంగ్రెస్ దొందూ దొందే

**బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్**

**వనపర్తి క్రైమ్ జనవరి 03 ప్రభాతవార్త :** రాబోయే స్థానిక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని మట్టి కల్పించే విధంగా భారతీయ జనతా పార్టీ విజయం సాధించబోతుందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు. బిజెపి వనపర్తి జిల్లా సంస్థాగత ఎన్నికల కార్యశాల 2025 బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ అధ్యక్షతన శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ స్వతంత్ర భారతావనిలో మునుపెన్నడూ లేని విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలో అత్యుత్తమైన విదేశీ దౌత్య విధానం పట్ల ప్రపంచంలోని ముస్లిం క్రైస్తవ, యూరోప్ యూనియన్ లాంటి దేశాలు భారత్లో పెట్టుబడులకు సుముఖంగా ఉన్నారని, ఐక్యరాజ్యసమితి ఆమోదం మేరకు ప్రపంచ దేశాలలో జూన్ 21 ప్రపంచ యోగా దినోత్స వం జరుపుకుంటున్నామంటే అది కేవలం బిజెపి ప్రధాని నరేంద్ర మోడీ ఘనత అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కమిటీలు కేసులు విచారణ పేరిట కాలయాపన తప్ప ఆరు గ్యారెంటీల మాటున ఇచ్చిన 420 హామీలు అమలు కాక రాష్ట్ర ప్రజలు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై తీసుకున్న చర్యలు మూడు అడుగులు ముందుకు ఏడు అడుగులు వెనక్కి చందంగా ఉందనీ దుయ్యబట్టారు. రాష్ట్రంలో పదేళ్ల బిఆర్ఎస్ పాలన కాంగ్రెస్ పాలన దొందు దొందే అన్న విధంగా ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన పూర్తిస్థాయి మంత్రివర్గం నియమించని అసమర్ధ దద్దమ్మ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఘాటుగా వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయని చేతులు మాత్రం గడపలు దాటట్లేదని బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన జ్ఞానానికి బొమ్మ బొరుసు లాగా ఒకటే రకం అని ఆరోపించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని మట్టి కల్పించే విధంగా భారతీయ జనతా పార్టీ విజయం సాధించబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థాగత బిజెపి జిల్లా రిటర్నింగ్ అధికారి రాజేందర్‌రెడ్డి ,జిల్లా అధ్యక్షులు డి నారాయణ ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబి రెడ్డి, వెంకట్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్ లోకనాథ్ రెడ్డి ,సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి ,ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బి శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రామన్ గౌడ్ ,ఓబీచ్ మోర్చా రాష్ట్ర నాయకులు చిత్తారి ప్రభాకర్ ,యువమోర్చా కదిరే మధు ,జిల్లా నాయకులు వెంకటేశ్వర రెడ్డి ,విష్ణువర్ధన్ రెడ్డి, పెద్దిరాజు, బోయల రాము ,మనివర్ధన్ ,ముప్పూరి చెన్నయ్య ,అశ్విని ,రాధ ,రాజశేఖర్ గౌడ్, ఎండి ఖలీల్ ,రవి నాయక్ ,మండల అధ్యక్షులు బచ్చు రాము, సంద వెంకటేష్ ,కావలి తిరుపతయ్య ,బుచ్చిబాబు గౌడ్, తిరుపతిరెడ్డి, అజయ్ గౌడ్, విష్ణువర్ధన్ ,కంచి ఆంజనేయులు ,నారాయణ ,రాయన్న ,నవీన్ చారి ,విజయసాగర్ ,ఎద్దుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలలో పైరవీకారుల పైచేయి : సంతోష్ రెడ్డి

**చిన్నచింతకుంట, జనవరి 3 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మండల తహసిల్దార్ కార్యాలయంలో పైరవీకారుల పెత్తనం కొనసాగు తుందని, అధికారులు అండదండలే దీని కారణమంటూ బిఎస్పి నియోజకవర్గ నేత బుసిరెడ్డి సంతోష్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండల డిప్యూటీ తహసిల్దారు చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ క్రాంతి కుమార్‌గౌడ్, ఆర్ఐ శశి కిరణ్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కార్యాలయంలోని గోడలపై పైరవీ కారులను ప్రోత్స హించొద్దు అని వ్రాసిన కార్యాలయం లోపల పైరవీ కాలదే పెత్తనం కొనసాగుతుందని ఆయన తెలిపారు. పైరవీకారులు తీసుకొచ్చే కుల,ఆదాయ స్థానిక ధ్రువపత్రాల దరఖాస్తులను అధికారులు ఎటువంటి పరిశీలన చేయకుండా జారీ చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక శాసన సభ్యుల పేర్లు చెప్పుకొని అధికారులను సైతం ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. కనీసం ప్రజా పాలనలోకూడా ప్రజలకు నేరుగా దరఖాస్తు పెట్టుకునే అవకాశం కన్పించడంలేదన్నారు. ప్రజాసమస్యలను నేరుగా పరిశీలించకుండా పైరవీలను ప్రోత్సాహిస్తున్న అధికారులపైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మండలంలో ఏ సమస్య కోసం అప్లికేషన్ పెట్టుకున్న దరఖాస్తు దారుడు లేదా వారి కుటుంబ సభ్యులు వస్తేనే పరిశీలించి ధ్రువపత్రం జారీ చేయాలని ఆయన కోరారు. పైరవీ పేర్లతో దరఖాస్తు దారుల దగ్గర అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. మండల కేంద్రాలలో వివిధ ధ్రువ పత్రాలకు అయ్యే ఖర్చును కార్యాలయంలో సూచిక బోర్డు ద్వారా మండల ప్రజలకు తెలపాలని అదేవిధంగా జారీ చేసే పత్రం, సమయాన్ని బహిరంగ పరచాలన్నారు. పైరవి వ్యవస్థ పై అధికారులు, పాలకులు చర్యలు తీసుకోకపోతే నేరుగా ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న బీఎస్పీ నేత సంతోష్‌రెడ్డి

## మహిళల హక్కుల కోసం పోరాడిన వీరవనిత సావిత్రి బాయ్ పూలే

**ఆధునిక విద్యతోనే స్త్రీ విముక్తి సాధ్యం: వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి**

**పెబ్బేరు జనవరి 3 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణంలో అంబేద్కర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రోజు నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలో పాల్గొని ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ దేశంలో మహిళల హక్కుల సాధన కోసం ఉద్యమించిన ధీరవనిత మహాత్మా సావిత్రిబాయి పూలే భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా పాఠశాలలు ఏర్పాటు చేసి అనేకమంది మహిళలకు విజ్ఞానాన్ని అందించిన గొప్ప ఉపాధ్యాయని అని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికి తల్లిదండ్రుల తర్వాత జ్ఞానాన్ని అందించేది ఉపాధ్యాయులు అని గుర్తు చేశారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని నమ్మిన గొప్ప మానవతా మూర్తి అని తెలిపారు. తన భర్త మహాత్మ జ్యోతిబాపూలే సహకారంతో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు విద్యను అందించే పనికి పూనుకుందని అన్నారు. ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో జరుగుతున్న కుల వ్యవస్థ, అస్పృశ్యత, అంటరానితనం కు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు నిర్మించిందని చెప్పుకొచ్చారు. అనంతరం పెబ్బేరు పట్టణానికి చెందిన కేడిఆర్ గ్రూప్ క్యాలెండర్ ఆవిష్కరణ లు పాల్గొన్నారు. పెబ్బేర్ పట్టణంలో రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న సంస్థలలో ఒకటైన కేడిఆర్ గ్రూప్ అని ఎమ్మెల్యే మేఘా రెడ్డి కేడిఆర్ గ్రూప్ చైర్మన్ దయాకర్ రెడ్డిని అభినందించారు. ఇలాగే ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలియజేశారు. గుమ్మడం లో చూసి రోడ్డుకు భూమి పూజ చేశారు. అనంతరం గ్రామానికి చెందిన 50 మంది టిఆర్ఎస్ కార్యకర్తలు బుజల భువనేశ్వర్ రెడ్డి ఎన్నారై ఆట మాజీ అధ్యక్షులు ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి జాయిన్ అయ్యారు వారికి ఎమ్మెల్యే మేఘారెడ్డి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి కండువాగప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, వనపర్తి మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,డైరెక్టర్లు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటసాగర్,మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, రవీందర్ నాయుడు, నాయకులు జగదీశ్వర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి,యాపర్ల రామ్ రెడ్డి, జి వెంకటేశ్వర రెడ్డి,టి వీరస్వామి, గంధం రాజశేఖర్,యువజన కాంగ్రెస్ నాయకులు రంజిత్ కుమార్, షకిల్, రాజేష్, శివకుమార్, సాయి రెడ్డి,శివ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ దినోత్సవం లో పాల్గొని ఉపాధ్యాయునిలకు సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే

## నేరేడుగాం వాసులు నిరాశ చెందవద్దు : మంత్రి జూపల్లి కృష్ణారావు

**మాగనూరు, జనవరి 3 ప్రభాతవార్త :** నేరేడుగాం వాసులు నిరాశ చెందవద్దని, తొందరలోనే గ్రామంలోని అన్ని కుటుంబాలకు 200 గజాల ఇళ్ల ప్లాట్లు ఇప్పించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. శనివారం మక్తల్ మండలంలోని ముంపు గ్రామమైన భూత్పూర్, మాగనూరు మండలం నేరేడుగం గ్రామాలను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి మంత్రి పరిశీలించారు. నేరేడుగాం గ్రామానికి వచ్చిన మంత్రి గ్రామంలో కూలిపోయిన ఇంటిని చూశారు. భూత్పూర్ ముంపు గ్రామంలో పరిస్థితి హీనాతి హీనంగా ఉందని, అలాగే నేరేడుగాంకు వస్తుంటే రహదారి కూడా భయంకరంగా ఉందని చెప్పారు. గత పదేళ్లుగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న విధంగా ఉందని, ముంపు గ్రామ వాసులకు ఇండ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ మొదలు కావాలన్నారు. అందరూ కలిసి నివాసానికి అనువైన స్థలాన్ని గుర్తించి ఎమ్మెల్యేకు చెబితే ఆయన జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ తో మాట్లాడి లెక్క ప్రకారం నోటిఫికేషన్ ఇప్పించి అందరికీ అనుగుణంగా మొట్టమొదట ప్లాట్లు ఫైనలైజ్ చేస్తామన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం స్థలాల కేటాయింపు జరుగుతుందని, గ్రామస్తులు ఎవరు ఆందోళన చెందవద్దని, భయపడాల్సిన అవసరం లేదని గ్రామస్తులకు ఈ సందర్భంగా మంత్రి ధైర్యం చెప్పారు. అంతకు ముందు మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి సంగం బండ జలాశయాన్ని సందర్శించి జలాశయ గేట్లను పరిశీలించారు. తుప్పు పట్టిన జలాశయ గేట్లకు మరమ్మతులు చేసి, పెయింట్ వేయాలని, మాన్యువల్‌గా కాకుండా ఆటోమేటిక్‌గా గేట్లు ఎత్తేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే భూత్పూరు, నేరేడుగం ముంపు గ్రామాల ప్రజలకు 200 గజాల ఇండ్ల స్థలాల పంపిణీకి సంబంధించి భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు ఫోన్ చేసి ఆదేశించారు.



ముంపు వాసులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## 6న హిందూ ధర్మ జాగరణ సమావేశం

**చిన్నచింతకుంట, జనవరి 3 ప్రభాతవార :** హిందూ సమాజాన్ని జాగృతం చేయడానికి ఈ నెల 6న శ్రీ కురుమూర్తి స్వామి ఆలయ ప్రాంగణంలో హిందూ ధర్మ జాగరణ సమావేశం నిర్వ హిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు సి.శివన్న తెలిపారు. ఈ సమావేశానికి విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర, జిల్లా నాయకులు రానున్నారని ఈ సమావేశానికి మండలంలోని హిందువులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## హమాలీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

**బిజినేపల్లి, జనవరి 03 ప్రభాతవార్త:** సివిల్ సప్లై గోదాంలో సంవత్స రాల తరబడి హమాలీలుగా పనిచేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు చంద్రశేఖర్ కోరారు . సివిల్ సప్లై గోదాం ముందు హమాలీ కార్మికులు మూడవరోజు నిరవధికసమ్మె చేపట్టారు. ప్రభుత్వం బోనస్ రూ.6500 నుంచి రూ.7500 వరకు పెంచి ఇస్తామని. నూతన రేట్లు అమలు చేస్తామని ఇచ్చి మూడు నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు కనీసం జీవో విడదల చేయలేదని కార్మికులు అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తమ న్యాయమైన డిమాండ్ల అమలకు అదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీలు ఎడ్ల శ్రీశైలం, నాగపురి శంకరయ్య, వేముల సాయిలు, ఇండ్ల కృష్ణయ్య, మండల మహేష్, శంకర్, శివ, శ్యామలమ్మ, తదితరులు ఉన్నారు.

## కేజీబీవీలకు ప్రత్యేక అధికారుల నియామకం

**ఉప్పునుంతల, జనవరి3 ప్రభాతవార్త:**మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయానికి స్పెషల్ ఆఫీసర్‌గా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయురాలైన కల్పనను నియమించారు. ఈమేరకు జిల్లా విద్యాధికారి ఉత్తర్వులను జారీ చేశారు. గత 20రోజుల నుంచి సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు సిఆర్‌పిలు, ఎంఐఎస్ ఆర్డినేటర్లు, కేజీబీవీ ఎస్‌ఓలు రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సమ్మె చేస్తున్నారు. అందులో కేజీబీవీ సిబ్బంది పాల్గొంటున్నారు. కేజీబీవీలలో ఏ లాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని కేజీబీవీలలో సీనియర్ మహిళా ఉపాధ్యాయులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. అన్నీ ఎమ్ఆర్‌సిలలో స్ట్రాంగ్ టీచర్‌లను సైతం నియమించారు.

## మంత్రి పొన్నాలను కలిసిన రాచాల



**కొత్తకోట జనవరి 3 ప్రభాతవార్త :** కొత్తకోట మండలం వడ్డెవాట గ్రామానికి చెందిన బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఆధ్వర్యంలో వారి అనుచరులతో హైదరాబాద్ లోని బిసి సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ఎన్నికల రిజర్వేషన్, తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, ఆర్టీఐ విభాగం వైస్ చైర్మన్ గుర్రం రాఘవేందర్, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్, మదనాపూర్ మండల అధ్యక్షుడు మహేందర్ నాయుడు, రమేష్ సాగర్, దేవర శివ, వనం మల్లేష్ యాదవ్, మహమ్మద్, నరసింహ, వసంత చారి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

**రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు**

**ధన్వాడ, జనవరి 3 ప్రభాతవార్త :** రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడల్లో ధన్వాడ మండలం కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 28 జట్లు పాల్గొన్నాయి. నారాయణపేట జిల్లా జట్టు తరపున కొండాపూర్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో కాంస్య పతకం సాధించారు. కొండాపూర్ గురుకులంలో చదువుతున్న కిషన్, గణేష్, శివకుమార్, మహేశ్.సతీష్, శ్రీను, గోపి విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చినందుకుగాను పాఠశాల ప్రిన్సి పాల్ రాజారాం, పీడీ కోచ్ రామ్మోహన్ గౌడ్ పీఈటీ ఆంజనేయులు, వైస్ ప్రిన్సి పాల్ సాంబయ్య, శ్రీనివాస్, నాయకులు విద్యార్థులను అభినందించారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**నారాయణపేట టౌన్, జనవరి 3 ప్రభాతవార్త :** సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సివిఆర్ భవనంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నారాయణ పేట జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలన్నారు. ఆమె విశిష్టత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ గందె అనసూయ చంద్రకాంత్‌తో బాటు తదితరులు ఉన్నారు.

## రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం

**మొదటి పేజీ తరువాయి భాగం**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

గ్రామాల్లో ప్రజలు తీవ్ర దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే బాధితులకు అన్ని వసతులతో కూడిన పునరావాస కేంద్ర ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఒక్క ఏడాదిలోనే మక్తల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. దాదాపు రూ.150 కోట్ల నిధులతో నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే మక్తల్, పేట, కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని మక్తల్ నియోజకవర్గంలోని రైతాంగానికి లబ్ధి చేకూరే విధంగా మార్పులు చేయించి దాదాపు రూ.4100 కోట్లతో పనులను చేపడుతామన్నారు. ప్రజల ఆశీర్వాదంతో తనలాంటి సామాన్య వ్యక్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన అంశాన్ని జీర్ణించుకోలేని కొందరు స్వార్థపరులు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, ఏనాడు తాను నీచ రాజకీయాలకు పాల్పడలేదన్నారు. అనవసరమైన ఆరోపణలు చేస్తే త్వరలోనే తగిన బుద్ధి చెప్తామన్నారు. కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు కె. శివకుమార్‌రెడ్డి, నాయకులు బాలకృష్ణారెడ్డి జి. లక్ష్మారెడ్డి, గవినోళ్ల గోపాల్ రెడ్డి, దేవరి మల్లప్ప, కోళ్ల వెంకటేష్, రవికుమార్,మార్కెట్ కార్యదర్శి బాలమణి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, డైరెక్టర్లు పాతింటి విష్ణువర్ధన్ రెడ్డి, రంజిత్ రెడ్డి, షాలం, నాగరాజు, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో పాలమూరు

**మొదటి పేజీ తరువాయి భాగం**

వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్లు, నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ చైర్మన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ విజయ్ కుమార్, మీడియా సెల్ కన్వీనర్ పాల్గొన్నారు. మార్కెట్ యార్డులో.. మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మహబూబ్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి జన్మదిన సందర్భంగా మార్కెట్ చైర్మన్ బెక్కరి అనితరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్ ఆధ్వరంలో పేదలకు పండ్లు, అదేవిధంగా ఆడపడుచులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ డైరెక్టర్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిమ్మాపూర్ నరసింహ, శ్రీనివాసులు, పాతూర్ కుమార్, చంద్రమౌళి పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణ ఆలయానికి 3 లక్షలు విరాళం

**కొత్తకోట జనవరి 03 ప్రభాతవార్త :** కొత్తకోట మండల పరిధిలో అతి సుందరంగా ముస్తాబవుతున్న శ్రీ కృష్ణ దేవాలయానికి సంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అమర్ రెడ్డి (దొర) తండ్రి జ్ఞాపకార్థంగా 3 లక్షల నగదును యశోద నందుడు విగ్రహ కొనుగోలుకు శ్రీ కృష్ణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు అమర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధికి మీ వంతు సహకరించినందుకు ఆ శ్రీ కృష్ణుని దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయని కమిటీ సభ్యులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నియోజకవర్గ ఇంచార్జ్ ముస్తఫా, శ్రీ కృష్ణ కమిటీ సభ్యులు సత్యం యాదవ్, బాలకొండయ్య, సాయిలు యాదవ్, శివన్న, రాజారామ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఫోటోరైటప్ : 3గద్వాల20: ఆలయానికి 3 లక్షలు అందజేస్తున్న అమర్ రెడ్డి

## కొల్లూరులో అయ్యప్ప స్వామి మహపడిపూజ

**భక్తి పారవశ్యంతో తరలివచ్చిన భక్తులు**

**నవాబ్‌పేట, జనవరి 3 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొల్లూరు గ్రామంలో అయ్యప్పస్వాముల మహపడి పూజ ,ఇరుముడి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగింది. భక్తి పారవశ్యంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అయ్యప్పస్వామి మహపడి పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలను తీసుకొని తరించారు. గ్రామ సమీపంలో ఉన్న అయ్యప్ప కొండపై ఏర్పాటు చేసిన పూజకు గ్రామ పెద్దలు నాయకులు భక్తులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు రమణ గురుస్వామి,అయ్యప్ప స్వాములు, నవాబ్‌పేట్ మండల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విస్లావత్ తులసి రామ్ నాయక్, వాసు యాదవ్, రఘు గుప్త, చందర్ నాయక్, సాలె నాగప్ప, కంకంటి కృష్ణయ్య, రత్నబాబు, వెంకటేష్ గౌడ్ సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఖాజ మైనోద్దీన్ భక్తులు ప్రజలు పాల్గొనడం జరిగింది.

03ఎంబిఎన్ఆర్ 38: అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న నాయకులు

## ధన్వాడలో సంతకాల సేకరణ

**మద్దతునిచ్చిన ప్రజలు**

**ధన్వాడ, జనవరి 3 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ధన్వాడలో శుక్రవారం పెండింగ్ బిల్లుల కోసం సంతకాల సేకరణ నిర్వహించారు. గ్రామ పంచాయతీ నిధులతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో అంజయ్య సంతకాలు సేకరణ ప్రారంభించారు. లక్ష్మీవాడలోని పోచమ్మగుడి, శివాలయంలో ప్రత్యేక పూజాలు నిర్వహించి సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీవాడలో కెంచె భాస్కర్, కేంచె నారాయణ, కెంచె జయప్రకాష్, గుండు బాలయ్య, దాసరి లక్ష్మన్న, నీరటి నర్సింలు నాయుడు, సంద చిన్న బాలనర్సిములు, శివరాములు, బాలస్వామి, మాజీ కోఆప్షన్ సభ్యులు కందమార్ రహిమన్బాబ్ తజోద్దీన్, షాకిర్ హుస్సేన్, మహ్మద్ రఫీ, మైబోలి ఖయ్యుం లంకాల గోపి, నంద రవి, మెంబర్ బాలయ్య, నీలి రాములు సంతకాల సేకరణలో పాల్గొన్నారు.

03ఎంబిఎన్ఆర్ 44: సంతకాల సేకరణ చేస్తున్న దృశ్యం

## భద్రతా నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు

**జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం**

**వాహనాదారులకు అవగాహన కల్పించిన డీటీఓ బి.మానస**

**వనపర్తి క్రైమ్ జనవరి 3 ప్రభాతవార్త :** రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించగలమని జిల్లా రవాణా శాఖ అధికారిణి బి.మానస అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం డిటీఓ కార్యాలయం వద్ద వాహన దారులకు ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాహనదారులు బయటకు వెళ్లేటప్పుడు, కుటుంబ సభ్యులు తమ కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రమాదాల్లో పెద్ద దిక్కును కోల్పోతే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందన్నారు. కాబట్టి వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, అతివేగం అనర్థదాయకమని, మద్యం తాగి వాహనం నడపవద్దని చెప్పారు. ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని హెచ్చరించారు. ఈ విషయాలను ప్రతి వాహనదారులు గమనించాలని, ఈ నెల 31 వరకు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ఉంటాయని డీటీఓ. మానస సూచించారు.

## సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగాలి

**అమరచింత డిసెంబరు 03 ప్రభాతవార్త :** మహిళలకు విద్యా హక్కు ఉండాలనే లక్ష్యంతో పోరాడి దేశంలో మొదటి ఉపాధ్యాయులుగా పేరుగాంచిన సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు శ్యాంసుందర్ అంబేద్కర్ జాతర కమిటీ జిల్లా కార్యదర్శి కావలి విజయ్ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రవీందర్ అన్నారు. శుక్రవారం అమరచింత మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే 134వ జయంతి సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలో మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో మహిళలకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేసి మహిళలకు విద్య నేర్పిన మహోన్నత వ్యక్తి ఆమె అని వారన్నారు. సావిత్రిబాయి పూలే చేసిన త్యాగాలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అజయ్ సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ ఎన్ రమేష్ బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బుచ్చన్న ,టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అక్కల నరసింహులు గౌడ్,డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ వీరితోపాటు అర్జున్ కుమార్, దేవేందర్, రామ్మూర్తి ,పెద్ద బాలరాజ్, శ్యామ్ ,సుమన్ ,సూరి ,శేఖర్ ,నబి ,సోనీ ,అక్బర్ ,కురుమన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**కొత్తకోట జనవరి 3 ప్రభాతవార్త :** మహిళల అభ్యున్నతికి దారి చూపిన మార్గదర్శి, కుల వివక్ష, పితృస్వామిక పీడలపై పోరాడిన వీరనారి, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు కొత్తకోట చౌరస్తాలో బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అదేవిదంగా బిఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల విద్యకు ఆద్యురాలిగా నిలిచి, సమానత్వానికి పోరాడిన సావిత్రి బాయి పూలే ఆశయాల సాధనకు పూలే దంపతుల సేవలను త్యాగాలను గుర్తు చేసుకున్నారు. భారత సమాజంలో చారిత్రాత్మకమైన మార్పుకు సావిత్రిబాయి పూలే పునాది వేశారని అన్నారు. లింగ వివక్ష, కుల అసమానతలపై ఆమె చేసిన పోరాటం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మాజీ జడ్పీటీసీ విశ్వేశ్వర్, సీడీసీ మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, అధికార ప్రతినిధి గడీల ప్రశాంత్, కౌన్సిలర్లు నాగన్న, అయ్యన్న,రవీందర్ రెడ్డి,మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ లక్ష్మీకాంత్ రెడ్డి, జగన్మోహనరెడ్డి, యూత్ అధ్యక్షులు పసుపుల నెహ్రూ, విద్యార్థి నాయకులు శ్రీను, రవీందరరెడ్డి, రాజు, నాగబాబు, యూత్ నాయకులు వినోద్ సాగర్, వికాస్, కిరణ్, నాగేశ్వర్ రెడ్డి, మహేష్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలి



పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం



నివాళులర్పించిన తాహసీల్దార్, సిబ్బంది

**కల్వకుర్తి, జనవరి 3 ప్రభాతవార్త:** దేశంలోనే సావిత్రి భాయి పూలే మొదటి మహిళా ఉపాధ్యాయురాలు అని సీనియర్ స్వేరో దుబ్బ నాగేష్ పేర్కొన్నారు శుక్రవారం కల్వకుర్తి పట్టణంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి పట్టణంలో మార్కెట్ యార్డ్‌లో సావిత్రి బాయి చిత్ర పటానికి పుల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ స్వేరో నాయకులు దుబ్బ నాగేష్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఆధునిక విద్య ద్వారానే స్త్రీలకి విముక్తి సాధ్యమవుతుందని నమ్మి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటిగా బాలికలకు పాఠశాలను ప్రారంభించారన్నారు. మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్య పరచడానికి 1852లో మహిళా సేవ మండల సంఘాలన్నీ కూడా స్థాపించారని కొనియాడారు. ఈ ఆధునిక భారతదేశంలో మహిళలు ఇంత స్వేచ్ఛగా ముందంజలో ఉన్నారంటే దాని అంతటికి కారణం సావిత్రిబాయి పూలే అన్నారు. ప్రతి ఒక్కరు సావిత్రిబాయి గారి జీవిత చరిత్ర ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వేరో సీనియర్ నాయకులు గిద్ద విజయ్ కుమార్, జి.శ్రీనివాస్, మీసాల అంజయ్య, స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్, జిల్లా ప్రతినిధి బొల్లె రమేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శేఖర్, మద్దల బంద, సోషల్ మీడియా కమాండర్ సంపత్ కుమార్, కొమ్ము రామస్వామి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**మాగనూరు,జనవరి 3 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎస్ యుటిఎఫ్ మాగనూరు మండల శాఖ ఆధ్వర్యంలో మాగనూరు మండలంలోని మహిళా ఉపాధ్యాయులందరికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించినందున జడ్పీహెచ్ఎస్ మాగనూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురలీధర్ రెడ్డి ఉపాధ్యాయులందరిని సన్మానించడం జరిగింది .ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి రాష్ట్ర కమిటీ సభ్యులు వేణుగోపాల్ మాగనూరు మండల అధ్యక్షుడు రాఘవేంద్ర చారి, ప్రధాన కార్యదర్శి నగేష్, ఉపాధ్యాయులు శంకర్, జమ్మన్న, బాబురెడ్డి, మహిళా ఉపాధ్యాయులు విజయలక్ష్మి, స్పందన అజ్రా ఫాతిమా, రవీంద్రమ్మ, ఇందూరాణి, అనిత, రమా, మహేశ్వరి దేవి, సంజన, శిరీష, అరుణ,శశిరేఖ, రోజా తదితరులు మహిళా ఉపాధ్యాయులను టీఎస్ యుటిఎఫ్ మాగనూరు మండల పక్షాన సన్మానించడం జరిగింది.

**ఇటిక్యాల, జనవరి 3 ప్రభాతవార్త :** భవిష్యత్తు తరాల కోసం తమ జీవితాలను త్యాగం చేసి మహిళల విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన గొప్ప మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని ఆమె జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణంగా ఉందని తాహసిల్దారులు నరేందర్, నరేష్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకునేందుకు నిర్ణయించగా అందులో భాగంగా ఇటిక్యాల, ఎర్రవల్లి తాహసిల్దార్ కార్యాలయాలలో తాసిల్దారులు నరేందర్, నరేష్. సిబ్బందితో కలిసి సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు నివాళులర్పించారు. అదేవిధంగా సాతర్ల గ్రామంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వెంకట్ నారాయణ అంబేద్కర్ విగ్రహం ముందు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే షాబాద్ గ్రామంలో ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అంతేకాక మండల పరిధిలోని పలు గ్రామాలలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు..

**చిన్న చింతకుంట, జనవరి 3 ప్రభాతవార్త:** మండల కేంద్రం లోనీ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల కాంగ్రెస్ యూత్ ఉపాధ్యక్షులు విన్సెంట్,మండలక్రిస్టియన్ మైనార్టీ నాయకులు ఎస్.ఆర్. శాంసన్ ఆధ్వర్యంలో సావిత్రి భాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల తహసీల్దార్ ఎల్లయ్య హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు జాకీర్, డి.వెంకటన్న, గంజి బాలరాజు ఎస్. శేఖర్, శ్రీనివాస్ గౌడ్, కుంద గోకరి ప్రవీణ్, ప్రతాప్,ఖాజా,మండల సోషల్ మీడి యా ఇంఛార్జి రాజు నాయక్, కవిరాజు,రాజు,జి.ఎనోష,ఫైనాన్స్ శ్రీనుగౌడ్ పాల్గొన్నారు.

**బిజినేపల్లి, జనవరి 3 ప్రభాతవార్త:** సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకు కృషి చేస్తామని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. రాజేష్‌రెడ్డి అన్నారు. బిజినేపల్లి మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని పూలే దంపతుల సేవలను త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే డా. రాజేష్ రెడ్డి మాట్లాడుతూ మహిళల విద్యకు ఆద్యురాలిగా నిలిచి, సమానత్వం కోసం పోరాడిన సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్న తరుణంలో మహిళా ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రాములు, శ్రీనివాస్ గౌడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగనమోని కిరణ్, పిఏసిఎస్ మాజీ చైర్మన్ వెంకటస్వామి, మాజీ సర్పంచులు రాజేందర్ గౌడ్, గంగనమోని తిరుపతయ్య, అమృత్ రెడ్డి, అవంతి శంకర్, బీసీ సంఘం నాయకులు దాసర్ల వెంకటస్వామి, రఘుబాబు, భగవంతుగౌడ్, మనోహర్, బంగారి పర్వతాలు, సత్యశీలా సాగర్, రామన్ గౌడ్, అల్లోజీ మధుసూదన్, ఈశ్వర్, నరేందర్ గౌడ్, ఈ శ్రీను, రాజుగౌడ్, జియాజి, తదితరులు పాల్గొన్నారు.

**రాజాపూర్, జనవరి 3 ప్రభాతవార్త :** క్తుల వివక్ష, పితృస్వామిక పీడలపై పోరాడిన వీరనారి, సామాజిక సంస్కర్త మహిళలకు అన్ని రకాల మార్గదర్శి సావిత్రిబాయి పూలే అని కాంగ్రెస్ పార్టీ రాజాపూర్ మండల అధ్యక్షుడు కత్తెర కృష్ణయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆ మహనీయురాలికి స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కత్తెర కృష్ణయ్య యాదవ్, ఏఎంసి డైరెక్టర్ వనపర్తి రమణ, శేఖర్‌గౌడ్, పిసిసి సోషల్ మీడియా కోఆర్డినేటర్ శివకుమార్, శ్రీనివాస్ నాయక్, నరహరి, విక్రమ్‌రెడ్డి, గోనెల రమేష్, గోపి కాంత్ రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కాంత్‌రెడ్డి, మొగిలి అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**వనపర్తి ప్రతినిధి జనవరి 3 ప్రభాతవార్త :** భారతదేశ తొలి మహిళ ఉపాధ్యాయురాలు సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. శుక్రవారం వనపర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించగా, ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ముఖ్య అతిథిగా విచ్చేసి మహిళా అధ్యాపకులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం శుభ పరిణామం అని పేర్కొన్నారు. విద్యార్థినులు సావిత్రి బాయి పూలే ఆదర్శంగా తీసుకుని చదువుతో పాటు ఇతర అంశాల్లో కూడా రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి అంజయ్య, వనపర్తి జిల్లా లోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

**భూత్పూర్,జనవరి 3,ప్రభాతవార్త :** భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిభాయి పూలే 194వ జయంతి వేడుకలు,మహిళా దినోత్సవ వేడుకల్ని శుక్రవారం భూత్పూర్ పట్టణ,రూరల్ ప్రాంతాలలో ఆయా పాఠశాలలు,కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. భూత్పూర్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయురాళ్లు,విద్యార్థినులు సావిత్రిభాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే సేవల్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దస్తయ్య, ఉపాధ్యాయులు యాదయ్యలతో పాటు మహిళా ఉపాధ్యాయులు పద్మమ్మ,పద్మావతి నీరజ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తకప్పెటలో..** భూత్పూర్ మండలంలోని కొత్తకప్పెట గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిభాయి పూలే 194వ జయంతి వేడుకలు ఉపాధ్యాయులు,విద్యార్థినులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి భాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు ఉషారాణి,రాధికారాణిలను పూలమాలలు,శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కడప వెంకటనారాయణ ఉపాధ్యాయులు హన్మంతరెడ్డి,నరసింహ,శ్రీనివాస్ పాల్గొన్నారు.

**నవాబుపేట,జనవరి 3 ప్రభాతవార్త :** మండలం సావిత్రిబాయి పూలే జయంతి 194వ జయంతి సందర్భంగా నవాబుపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్మ సమాజ్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ మహిళల విద్యకు ఆద్యురాలిగా నిలిచి, సమానత్వానికి పోరాడారని వివరించా రు. పూలె దంపతుల సేవలను త్యాగాలను గుర్తు చేసుకు న్నారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట మండల ధర్మ సమాజ్ పార్టీ నాయ కులు మండల కమిటీ సభ్యులు ప్రసాద్, రమేష్, కరుణాకర్, ఆంజ నేయులు, అంబేద్కర్,రామకృష్ణ,రామస్వామి,నర్సిములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్





వేడుకలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు,విద్యార్థినులు



పూలె జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

## విద్యార్థులు గ్రామీణ స్థాయి నుండి నోబెల్ స్థాయికి ఎదగాలి

**చిన్న మెదడులో పెద్ద ఆలోచన ఆకట్టుకున్న జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన**

**నారాయణపేట టౌన్, జనవరి 3 ప్రభాతవార్త :** విద్యార్థులు గ్రామీణ స్థాయి నుండి నోబెల్ బహుమతుల స్థాయికి ఎదగాలని డీఈవో గోవిందరాజులు అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభమైనది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ పరిజ్ఞానం అనేటటువంటిది ప్రతి విద్యార్థికి అవసరమన్నారు. పాఠశాలలో విద్యభ్యసించే విద్యార్థినీ విద్యార్థులకు మెదడుకు మేత లాంటిదని పేర్కొన్నారు. నేటి సమాజంలో శాస్త్రీయ పరిజ్ఞానం చాలా అవసరం అన్నారు. విద్యార్థి దశ నుండి శాస్త్రీయ పరిజ్ఞానం లో మెలకువలను నేర్చుకోవడం వలన ఉన్నత విద్యలో ఉపయోగపడుతుందని సూచించారు. ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలను ఏర్పాటు చేయడం వలన భావి భారత శాస్త్రవేత్తలను తయారు చేయడానికి అవకాశం ఉందన్నారు. రాబోయే రోజులలో నోబెల్ బహుమతిని గెలుచుకునే దిశగా విద్యార్థులు ఎదగాలని సూచించారు. శాస్త్రీయ దృక్పధాన్ని అలవరుచుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. కొత్త కొత్త విషయాలు కనుక్కోవడం శాస్త్రీయ పరిజ్ఞానం వలన సాధ్యమైతుందన్నారు. విద్యార్థి దశ నుండే వైజ్ఞానిక పరిజ్ఞానములో విద్యార్థులను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చిన్న మెదడుకు పెద్ద ఆలోచన కల్పించి ప్రతిభను వెలికితీయాలన్నారు. అలాంటి విషయాలు ఉపాధ్యాయులకే సాధ్యమని వారిని కొనియాడారు. ప్రతి ఒక్కరూ సైన్స్ ద్వారా జీవితంలో చాలా విషయాలు నేర్చుకుంటారన్నారు. కష్టపడి రాబోయే కాలంలో సైంటిస్టులుగా ఎదగాలని సూచించారు. మారుమూల గ్రామీణ స్థాయి నుండి జాతీయస్థాయి వరకు ఎదగాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎంత ఎదిగిన ఒదిగి ఉండాలని హితవు పలికారు. ప్రతి విషయాన్ని కూడా శ్రద్ధగా విని నిష్ణాతులుగా తయారు కావాలన్నారు. గురువులను గౌరవించాలని గురువుల నుండి మంచిని స్వీకరించి ఉన్నతంగా ఎదగాలన్నారు. అంతకుముందు అతిథులను బ్యాండ్ మేళాలతో ఘనంగా స్వాగతించారు. అనంతరం సావిత్రిబాయి పూలే సివి రామన్ సరస్వతి దేవి చిత్రపటాలకు పూజా కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని ఆయా పాఠశాలల విద్యార్థులచే చేసిన ప్రయోగాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి, జెడ్పి సీఈవో భాగ్యలక్ష్మి, డిఆర్‌డిఏ పిడి మొగులప్ప, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ, జడ్పి డిప్యూటీ సీఈవో జ్యోతి, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రకాష్, మున్సిపల్ చైర్ పర్సన్ గందె అనసూయ చంద్రకాంత్, కాంగ్రెస్ నాయకులు బండి వేణుగోపాల్, మధుసూదన్ రెడ్డి,కోట్ల రవీందర్ రెడ్డి, సతీష్ గౌడ్, ఏఎమ్ఓ విద్యాసాగర్ సీఎంఓ రాజేంద్రకుమార్, పిఆర్‌టియూ జిల్లా అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షులు శేర్ కృష్ణ రెడ్డి, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యాశాఖ అధికారిపై అడిషనల్ కలెక్టర్‌కు కాంగ్రెస్ నాయకుల పిర్యాదు

**నారాయణపేట టౌన్, జనవరి 3 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కాలేజీ లో నిర్వహించే జిల్లా స్థాయి ఇన్స్పైర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శన2024 కార్యక్రమానికి జిల్లా ఎమ్మెల్యే లను ఆహ్వానించకుండా, ప్రోటోకాల్‌కు విరుద్ధంగా స్టేజ్ పై ఏర్పాటు చేసిన బ్యానర్లపై ముఖ్యమంత్రి, జిల్లా ఎమ్మెల్యేల ఫోటోలు ముద్రించకుండా తీవ్రంగా అవమానపర్చిన నారాయణపేట జిల్లా విద్యా శాఖ అధికారి, ఆ శాఖ సిబ్బంది పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి.సలీంతో బాటు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ బెన్ షాలోమ్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు ఎండి.సలీం మాట్లాడుతూ జిల్లా విద్యా శాఖ అధికారి ప్రోటోకాల్ పాటించకుండా ప్రజాప్రతినిధులను తీవ్రంగా అవమానించడం జరిగిందన్నారు. సాక్షాత్తు మన జిల్లా వాసి అయినా ముఖ్యమంత్రి స్వయంగా విద్యా శాఖను నిర్వహిస్తున్నారని అలాంటి ముఖ్యమంత్రి ఫోటోను స్టేజి బ్యానర్లలో వేయకుండా అవమానించారన్నారు. గత నెలలోనే ఇది వరకు ఏర్పాటు చేయవలసిన ఈ కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని తిరిగి ఈ నెల 3,4 తేదీల్లో మళ్ళీ నిర్వహిస్తున్న కార్యక్రమం గురించి జిల్లా ఎమ్మెల్యేలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే కార్యక్రమం నిర్వహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఒక పక్కన జిల్లాలో అందరికీ విద్య అందించాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలు పట్టుదలగా విద్యాభివృద్ధికి కృషి చేస్తుంటే, జిల్లా విద్యాశాఖ అధికారుల పనితీరు మాత్రం అందుకు విరుద్ధంగా ఉందని, జిల్లాకు చెడ్డ పేరు తెచ్చే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. జిల్లాలో చాలా మంది ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠశాలలు, ఫైనాన్స్‌లు, చిట్టీలు నడుపుతూ పాఠశాలలకు డుమ్మాలు కొడుతున్నట్లు తమ దగ్గర సమాచారం ఉందని ఆరోపించారు. త్వరలో ఎమ్మెల్యే ద్వారా ముఖ్య మంత్రికి కలిసి పేట జిల్లా విద్యాశాఖలో జరుగుతున్న తతంగాన్ని వారి దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా విద్యా శాఖపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి, విద్యాశాఖను గాడిలో పెట్టాలని అదేవిధంగా ప్రోటోకాల్ పాటించకుండా అవమాన పరిచిన బాధ్యులపై పూర్తి విచారణ చేయించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మారుతి వెంకటేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## మహిళా విద్యకు తొలి వెలుతురు

**ఎన్టీఆర్ మహిళ సావిత్రి డిగ్రీ కళాశాలలో బాయి పూలే జయంతి సందర్భంగా మహిళా దినోత్సవం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 3 ప్రభాతవార్త:** స్థానిక ప్రభు త్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం సావిత్రి బాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిభాయి పూలే చిత్రపటానికి కళాశాల ప్రిన్సి పాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ము ఖ్య అతిథిగా విచ్చేసిన యంవిఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. పద్మావతి మాట్లాడుతూ మొదటి భారతీయ మహిళా ఉపా ధ్యాయురాలు సావిత్రి భాయి పూలేను నేటి తరం మహిళా విద్యార్థులైన మీరంతా ఆదర్శంగా తీసుకోవాలని ఇవాళ స్త్రీలు విద్యారంగంలో ఉన్నారంటే అది సావిత్రి భాయి పూలే చలువ అని కీర్తించారు. ఇప్పుడు మన జిల్లాలో కలెక్టర్, ఎస్పీ, ఇలా ఎన్నో రంగాల్లో మహిళలు ముందున్నారు. అసమానతలు ప్రబ లంగా ఉన్న ఆ రోజుల్లో వాటికి ఎదురొడ్డి పూలే కుటుంబం పో రాడిన తీరు అసమానమైనదన్నారు. అణగారిన వర్గాల ప్రజల సంక్షేమం కోసం, సమాజ మార్పుకోసం జీవితాంతం కృషి చేసి న విప్లవ చైతన్య మూర్తి, సామాజిక ఉద్యమకారిణి సావిత్రిబా యి పూలే అని కొనియాడింది. అదేవిధంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య. వి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ భారతీయ విద్యా ఉద్య మం తలపెట్టిన తొలి మహిళా, విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని విద్యకోసం విశేష కృషిచేసిన సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా రాష్ట్ర ప్రభు త్వం ప్రకటించడం హర్షించదగ్గ విషయం అని, సమాజంలో మహిళ విద్య పట్ల వ్యతిరేకత ఉన్న కాలంలో తొలి భారతీయ మహిళా ఉపాధ్యాయురాలిగా ఎదిగిన గొప్ప మహిళ సావిత్రిభా యి పూలే, ఆమె జీవితం సమాజ సేవలో ప్రతిఒక్కరి బాధ్యత ను గుర్తు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డా. పద్మ అనురాధ, అమీనా ముంతాజ్ జహాన్, వాసంతి, డా. హరిబాబు, అశోక్ కుమార్, విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లైంగిక దాటికీ పాల్పడిన వ్యక్తికి రిమాండ్

**నారాయణపేట టౌన్, జనవరి 3 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఐదేళ్ల చిన్నారి బాలికతో అసభ్యంగా ప్రవర్తించి లైంగిక దాడికి పాల్పడిన నరేష్ అనే నిందితుని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని డిఎస్పి ఎన్ లింగయ్య తెలిపారు.